క్లుప్తంగా

నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గార్డియన్ స్కూల్ విద్యార్థులకు ఎంఈవో విడుపు శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు తక్కువ ఫీజు తీసుకుంటూ, కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు తనవంతు సహాయం అందిస్తానన్నారు. అనంతరం ఎంఈవోను పాఠశాల నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాహితి ఫౌండేషన్, స్కూల్ నిర్వాహకులు మహమ్మద్ అంకూస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న సొల్లు అజయ్‌వర్మ

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతో ఇరువైపుల ఇళ్లకు నష్టం జరుగుతోందని, ఆ ఇళ్లను కాపాడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, గునుకుల కొండాపూర్ మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ కోరారు. సోమవారం డబుల్ రోడ్డు పనులను పరిశీలించారు. రహదారి విస్తరణ పనులు చేపట్టడం సంతోషమే కానీ నిర్మాణంలో భాగంగా రహదారి ఎత్తు పెంచడంతో ఇళ్లకుకు ప్రమాదం ఏర్పడనుందని, ఎత్తు తగ్గించి పనులు చేపట్టాలన్నారు. పనులను సంబంధిత అధికారులు పరిశీలించి, గునుకులకొండాపూర్ వద్ద కల్వర్టు నిర్మించాలని కోరారు.

కలెక్టర్‌కు వినతులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ శివారులో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపైన ఉన్న పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది, తక్షణం మరమ్మతులు చేపట్టాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి కూలిపోయేలా ఉందని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించాలని కోరారు.

హుజూరాబాద్: ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎంఈవో పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు తెలంగాణ విద్యార్థి యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రజావాణిలో మొలంగూర్ గ్రామానికి చెందిన యువజనసమితి రాష్ట్రకార్యదర్శి మోరె గణేశ్ విన్నవించారు. భారీ వర్షాలకు గదులు కూలిపోయే ప్రమాదం ఉందని, తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు.

కొనసాగుతున్న నిర్మాణాల తొలగింపు



జేసీబీతో నిర్మాణాలు తొలగిస్తున్న దృశ్యం

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం ముందు కొనసాగుతున్న వివాదాస్పద నిర్మాణాలను సోమవారం మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించారు. మున్సిపల్ కార్యాలయం ముందు ప్రభుత్వ బాలికల పాఠశాల, ఎస్‌డబ్ల్యూ కార్యాలయాల ముందు రోడ్డుపై పది షట్టర్లు నిర్మించారు. నిర్మాణాలపై వివిధ పార్టీల నాయకులు అభ్యంతరాలు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ కమిషనర్ ఎందుకు ఆపడం లేదని బీజేపీ నాయకులు బింగి కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల మహేందర్ గౌడ్ కలెక్టర్‌కు, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాలతో కొన్ని రోజులపాటు నిర్మాణాలు ఆగిపోయాయి. కొన్నాళ్లకు మళ్లీ నిర్మిస్తుండటంతో పలు ప్రజా సంఘాలు, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో ఆపేశారు. 2023 సెప్టెంబర్‌లో హాస్టల్ వార్డెన్లు సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించకుండా మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్ర వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నేరెళ్ల మహేందర్ గౌడ్ ఇటీవల కలెక్టర్, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా వారి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ నిర్మాణాలను కూల్చివేశారు.

ఎవరూ తగ్గేదేలే..!

- పెరుగుతున్న గెట్టు పంచాయితీలు
- భూమి ధరలు పెరగడమే కారణం
- ఇన్‌చార్జి సర్వేయర్లే దిక్కు
- పెండింగ్‌లో భూమి కొలతలు
- ఇబ్బంది పడుతున్న భూ యజమానులు

వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ఓ రైతు 2023 మే నెలలో భూమి కొలత కోసం మీ సేవలో రూ.295 పెట్టి దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 45 రోజుల లోపు సర్వేయర్ భూమి కొలతలు చేపట్టాలి. కానీ ఇప్పటి వరకు అతని భూమి సర్వే చేయలేదు. అప్పటి సర్వేయర్‌కు నాలుగు మండలాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో అది సాధ్యం కాలేదు. సదరు రైతు మళ్లీ రెండుసార్లు మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల గన్నేరువరం సర్వేయర్‌కు ఇన్‌చార్జిగా వీణవంక మండల బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 22న సర్వే చేస్తానని సదరు సర్వేయర్ నోటీసులు ఇచ్చాడు. కానీ ఇంతలో అతనికి ఎస్సారెస్పీ కెనాల్ సర్వే చేసే బాధ్యతలు అప్పగించడంతో సర్వే పెండింగ్‌లో పెట్టాడు. మరో వారం రోజులు గడిస్తే నాట్లు వేయనుండటంతో సదరు రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. ఇదీ ఈ ఒక్క రైతు పరిస్థితి కాదు. నియోజకవర్గంలోని రైతుల అందరి దుస్థితి.



తహసీల్దార్ కార్యాలయం

వీణవంక: భూ కొలతలకు శాశ్వత సర్వేయర్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా ఇన్‌చార్జి సర్వేయర్‌లే కొనసాగుతుండటంతో కొలతలు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 29వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 14వేల మంది రైతులు ఉన్నట్లు అధికారుల లెక్కలు. వ్యవసాయ ఆధారిత మండలం కావడంతో ఇక్కడ భూముల రేట్లు అమాంతం పెరిగాయి. ముఖ్యంగా హైబ్రిడ్(ఆడ, మగ)వరి సాగు చేస్తూ ఇక్కడి రైతులు మంచి లాభాలు అర్జిస్తున్నారు. దీంతో ఎకరం భూమి రూ.20–40 లక్షల వరకు పలుకుతోంది.

అదనపు బాధ్యతలు..

గతంలో పని చేసిన సైదాపూర్ సర్వేయర్‌కు వీణవంక, కేశవపట్నంతో పాటు వరంగల్– కరీంనగర్ జాతీయ రహదారి సర్వే బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎక్కువ సమయం రహదారి సర్వేకు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అతను బదిలీపై వెళ్లడంతో గన్నేరువరం మండల సర్వేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇతను కుదురుకునే లోపు ఈ నెల 20నుంచి గౌరవెల్లి రిజర్వాయర్ సర్వే బాధ్యతలు అప్పగించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో రైతు మీ సేవలో పదుల సార్లు దరఖాస్తు చేసుకున్న భూమి కొలిచే నాథుడు లేకపోవడంతో గెట్టు పంచాయతీలు పెరిగిపోతున్నాయి. గుంట, అరగుంట కోసం రైతులు, అయిన వాళ్లు గొడవలు పెట్టుకుంటున్నారు.

ఠాణా మెట్లెక్కుతున్న రైతులు..

భూమి కొలతకు మీ సేవలో రైతులు దరఖాస్తు చేసుకొన్న సర్వేయర్ లేకపోవడంతో రైతుల మధ్య గొడవలు పెరిగి పోలీస్ స్టేషన్ వరకు చేరుతున్నాయి. దీంతో భూముల పంచాయితీ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఒక్కో సర్వేయర్‌కు రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు ఇవ్వడంతో పాటు ఇతర కొలతలు అప్పగిస్తుండటంతో వారికి పని భారం పెరిగింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వీణవంక మండలానికి శాశ్వత సర్వేయర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

శాశ్వత సర్వేయర్ లేక ఐదేళ్లుకావస్తోంది. దీంతో భూ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. గతంలో పని చేసిన సర్వేయర్‌కు జాతీయ రహదారి సర్వేతో పాటు మూడు మండలాల బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడున్న సర్వేయర్‌కు గౌరవెల్లి రిజార్వయర్ సర్వే అప్పగించడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కో రైతు నాలుగుసార్లు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న సర్వే చేయడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత సర్వేయర్‌ను నియమించాలి.

– సుధాకర్, రైతు, వీణవంక

జగిత్యాల ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్: మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తా వద్ద జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. పార్టీ మారడాన్ని వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల మధు, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి శాతరాజు యాదగిరి, దండు బోయిన శేఖర్, పిండి సందీప్, బొల్లం శశి, గోపు ఈశ్వర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలుపొంది ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. నాయకులు మహిపాల్, శ్రీనివాస్‌రెడ్డి, సమ్మయ్య, రంజిత్‌రావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: అలుగునూర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనంచేశారు. దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కన్నతల్లి లాంటి బీఆర్‌ఎస్‌కు ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోవడం సిగ్గుచేటన్నారు. వైస్ ఎంపీపీ వీరారెడ్డి, సొసైటీ చైర్మన్ స్వామిరెడ్డి, ఆత్మా కమిటీ మాజీ చైర్మన్ పాశం అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాతంగి లక్ష్మణ్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మాదన రాజేందర్, సీనియర్ నాయకులు వేల్పుల మల్లయ్య, బొర్ర రవి, వడ్లూరి శంకర్, వంతడుపుల సంపత్, పోతురాజు దేవేందర్, మారం వీరేష్, గడ్డి రమేష్ , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అలుగునూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

‘బ్రిడ్జి సాధన ఉద్యమాన్ని ఆపలేరు’

గన్నేరువరం: తప్పుడు కమిటీలతో బ్రిడ్జి సాధన ఉద్యమాన్ని అణిచివేయాలని పుల్లెల జగన్, రాములు, కయ్యం సంపత్ కుట్ర పన్నుతున్నారని, ఎన్ని కుట్రలు చేసిన బ్రిడ్జి నిర్మాణ లక్ష్యం నెరవేరే వరకు పోరాటం ఆగదని బ్రిడ్జి సాధన కమిటీ అధ్యక్షుడు సంపతి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మాదాపూర్‌లో సోమవారం గ్రామస్తులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బ్రిడ్జి అంశం గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజల సమస్య, ఎల్ఎండీ నిర్మాణం తరవాత 9 నుంచి 40 కిలోమీటర్ల దూర భారం పెరిగి, విద్య, వైద్యానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పది సంవత్సరాల నుంచి వివిధ గ్రామాల యువకులు బ్రిడ్జి సాధన కమిటీ ఏర్పాటు చేసి ధర్నా, రాస్తా రోకోలు చేస్తున్నారని, కొత్త కమిటీలతో ఉద్యమాన్ని ఆగం చేయాలని చూస్తున్నారని, వీరి చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇటీవల వారిని బ్రిడ్జి జేఏసీ కమిటీ నుంచి తొలగించామని, అసలైన బ్రిడ్జి జేఏసీ కమిటీ నా అధ్యక్షత ఉందని, దాన్ని సాధించేందుకు త్వరలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న సంపతి ఉదయ్‌కుమార్

అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

- జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందాయా అని తెలుసుకున్నారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని టీచర్లకు సూచించారు. ప్రతి విద్యార్థికి గతేడాది విద్యార్థులు సాధించిన గ్రేడు వివరాలు తెలియజేయాలన్నారు. వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో చక్కగా మాట్లాడటం, భావవ్యక్తీకరణ శక్తిని కలిగి ఉండేటట్లు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కె. అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం సుదర్శనం, టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

దరఖాస్తుల ఆహ్వానం



చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శపాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన హిందీ, తెలుగు సబ్జెక్టులు బోధించేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 28న ఆదర్శ పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

క్రీడాపాఠశాలల్లో ప్రవేశానికి రేపు ఎంపిక పోటీలు

వీణవంక: 2024–25 విద్యా సంవత్సరానికి క్రీడాపాఠశాలలో ప్రవేశం కోసం బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో విడపు శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి ఉత్తీర్ణులై 1/9/2015 – 31/8/2016 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హుల, ఆధార్ కార్డుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం, ఫోటోతో వీణవంక హై స్కూల్‌లో మైదానంలో హాజరు కావాలని సూచించారు. వివిధ రకాల క్రీడా పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని వివరాలకు పీడీ శ్రీనివాస్ 9346120205, చల్లూరు పాఠశాల పీడీ రజిని 9491644402 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి ఫ్లెక్సీ క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్షీరాభిషేకం

గన్నేరువరం: రైతులకు రెండు లక్షల రుణమాఫీపై కేబినేట్ అమోదం తెలిపిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనిల్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, వీరయ్య, రాజయ్య, సంపత్‌రెడ్డి, జీవన్, పర్శరాం, సంపత్‌కుమార్, వీరేశం, జగన్, శ్రీధర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొంకటి జయప్రకాష్, పెంకర్ల ప్రశాంత్ తదితరులలు పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

హుజూరాబాద్‌రూరల్ : రైతు వేదిక కార్యాలయాల్లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం జరగనున్నట్లు సోమవారం ఏడీఏ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమం జరనున్నట్లు తెలిపారు. వానకాలం సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తలు వివరించనున్నట్లు తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలి

జమ్మికుంట: ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం, సీబీఎస్ సిలబస్ పేరుతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు దోపిడీకి పాల్పడుతున్నాయని, అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చి పాఠశాలల్లో వసతులు కల్పించాలన్నారు. విద్యను వ్యాపారంగా చేస్తున్నారని, అధికారులు ఎక్కడిక్కడ తనిఖీలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాజకుమార్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కైలాసకోటి గణేష్, దేవులపల్లి నవీన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ప్రతిరోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి సోమవారం ఆరోపించారు. ఆరు నెలలుగా త్రీఫేజ్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులను అడిగితే సాంకేతికలోపం అంటున్నారు కానీ లోపాన్ని సరిచేయడంలేదన్నారు. ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న గ్రామస్థాయి సిబ్బంది లోపం బాగా కనిపిస్తోందని, మండల, జిల్లాస్థాయి అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని, వారానికోసారైన గ్రామాలు, సబ్‌స్టేషన్లు తనిఖీ చేస్తే విషయం బయటపడుతుందన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం

మానకొండూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1986–87 పదో తరగతి విద్యార్థులు ఒక చోట సమావేశమై పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా జి. వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా గోశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి ఎల్లయ్య, కార్యదర్శిగా మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

పంచాయితీలతోనే పబ్బం

జమ్మికుంట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అమలు చేయకుండా, ప్రజా సమస్యలు గాలికొదిలి బూడిద పంచాయితీతో పబ్బం గడుపుతున్నారని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ సోమవారం ప్రశ్నించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తానన్న కౌశిక్ రెడ్డి హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు చేయలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందన లేదని ఆరోపించారు. వ్యక్తిగత ఆరోపణలు చేసుకోవడం సమంజసం కాదని హామీలు అమలు చేయాలన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పాడి కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలకు మంత్రి స్పందించక పోవడం అనుమానాలకు తావిస్తోందని, కౌశిక్‌రెడ్డి ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని లేని పక్షంలో రెండు పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి గ్రహణం

- ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికుల తిప్పలు
- ఫిబ్రవరిలో పునఃనిర్మాణ పనులు ప్రారంభం
- ఇప్పటికీ పూర్తికాని వైనం



నిలిచిపోయిన బస్‌షెల్టర్ నిర్మాణం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ స్టేజీపై ఆర్టీసీ బస్‌షెల్టర్ పునఃనిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో నాలుగు నెలల నుంచి పనులు జరగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజీవ్ రహదారిలో ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నారు. కొన్నేళ్ల నుంచి ఆర్టీసీ బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో సైకిల్‌స్టాండ్‌గా మారింది. ‘సాక్షి’లో పలుమార్లు బస్‌షెల్టర్ దుస్థితిపై ప్రచురించిన కథనాలకు ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. బస్‌షెల్టర్ పునఃనిర్మాణానికి ఫిబ్రవరిలో పనులు ప్రారంభించగా ఓ వ్యక్తి అడ్డుకుని గోడను కూల్చివేయడం వివాదాస్పదంగా మారింది. సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్టీసీ అధికారులు ఈ సంఘటనపై స మగ్ర విచారణ జరిపించారు. అనంతరం బస్‌షెల్టర్ పనులు కొనసాగిస్తామని చెప్పినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో పనులు నిలిపివేశారు. బస్‌షెల్టర్ పనులు ప్రారంభించాలని స్థానిక ప్రజాప్రతినిధులు పలుమార్లు అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినా సమ్మక్క జాతర, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సాకుతో మిన్నకుండిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి పీవీ జిల్లా ఏర్పాటు అంశం

హుజూరాబాద్: పీవీ పేరిట హుజూరాబాద్ జిల్లా ఏర్పాటు గూర్చి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తెలిపారు. సోమవారం జిల్లా సాధన సమితి నాయకులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా ఏర్పాటు అవశ్యకతను మంత్రికి వివరించగా సానుకూలంగా స్పందించి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారని వివరించారు. సమావేశంలో జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ భీమోజు సదానందం, సైదాపూర్ మాజీ ఎంపీపీ పాడిశెట్టి వెంకటరాజం, తాటిపల్లి రాజన్న, వేల్పుల రత్నం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొల్లు బాబు, తాళ్లపల్లి రమేశ్, డాక్టర్ విష్ణుదాస్ గోపాలరావు, డాక్టర్ తడికమళ్ల శేఖర్, మార్త రవీందర్, మిడిదొడ్డి శ్రీనివాస్, ఎలబోతారం మాజీ సర్పంచ్ నమిండ్ల రవీందర్, రాం రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

నివాస స్థలాలు కేటాయించాలని వినతి

కరీంనగర్/కరీంనగర్ అర్బన్: తెలంగాణ ఉద్యమకారులకు మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామ శివారులోని జాలగుట్ట సర్వే నంబర్ 50,51లోని భూమిలో 250 గజాల నివాస స్థలాలు కేటాయించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతికి సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కనుకం కుమారస్వామి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిధిలో ఉన్నటువంటి తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి నివాస స్థలాలు కేటాయిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ముంజంపల్లి శివారులో స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోశెట్టి సంజీవ్, జమ్మికుంట మండల అధ్యక్షుడు గోవింద్ మల్లేశం, తిమ్మాపూర్ మండల నాయకులు కూనమల మల్లేశం, కనకం శంకర్, మామిడి మొగిలి, తాటిపల్లి శంకరయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

బొమ్మనపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను చోరీకి గురైంది. రైతులు, గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామశివారులోని పెద్దగొల్ల చంద్రయ్య, దరిపెల్లి వీరస్వామి రైతుల వ్యవసాయబావుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఉదయం బావుల వద్దకు వెళ్లిన ఇద్దరు రైతులకు ఖాళీ డబ్బాలు కనిపించడంతో చిగురుమామిడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నారు పోసుకునే సమయంలో ఇలా చేయడం దారుణమని వాపోయారు.



మరుగుదొడ్లు ఉన్నాయా..

కరీంనగర్‌రూరల్: వ్యక్తిగత మరుగుదొడ్లపై సమగ్ర సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో ఉత్తమ పంచాయతీలకు అవార్డులు ఇచ్చేందుకుగాను వ్యక్తిగత మరుగుదొడ్లపై ప్రభుత్వం ఏటా సమాచారం సేకరిస్తోంది. మరుగుదొడ్లపై వాస్తవాలను నిర్ధారించడంతోపాటు లేనివారికి కొత్తవి మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మంగళవారం నుంచి గ్రామాల్లో మరుగుదొడ్లపై పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం కరీంనగర్ మండల పరిషత్తు కార్యాలయంలో మరుగుదొడ్ల సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్డి ఉందా లేదా అనే వివరాలను సేకరించాలని సూచించారు. ఇంటి యజమానితోపాటు మరుగుదొడ్డి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. 30వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్డి లేనివాళ్లకు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తుందని ఎంపీవో అన్నారు.